ప్రజాశక్తి

శనివారం 10 ఆగస్టు 2024 5

శ్రీ సత్యసాయి

'క్విట్ కార్పొరేట్.. సేవ్ అగ్రికల్చర్'

జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

ధర్మవరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

దేశ సంపదను లూటీచేసే కార్పొరేట్ సంస్థలను బహిష్కరిద్దాం.. వ్యవసాయ కార్మిక రంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా రైతు, శ్రామిక, కార్మిక సంఘాల నేతలు 'క్విట్ కార్పొరేట్' నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్లను బహిష్కరిద్దామని రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ వ్యవసాయ కార్మిక సంఘాన్ని కాపాడుకుందాం అని నిరసన ర్యాలీలు చేపట్టారు. "క్విట్ కార్పొరేట్- సేవ్ అగ్రికల్చర్" నినాదంతో పెనుకొండ, సోమందేపల్లి, పుట్టపర్తి, కొత్తచెరువు, ముదిగుబ్బ, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందించారు. గత పదేళ్లుగా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ వ్యవసాయాన్ని విచ్ఛినం చేస్తూ కార్పొరేట్లకు ఎర్ర తివాచీ వేస్తున్నారని చెప్పారు. ఇలాంటి చర్యలను తిప్పికొట్టి కార్పొరేట్‌లను తరిమి కొట్టాలని నాయకులు పిలుపునిచ్చారు.

వార్త 6లో

కూటమిలో లుకలుకలు..!

◆ ధర్మవరంలో టిడిపి, బిజెపి నేతల మధ్య విభేదాలు ◆ ప్రతి విషయంలోనూ పోటాపోటీ



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, బిజెపి, జనసేన మూడు పార్టీలు కూటమిగా పోటీ చేశాయి. అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానం ఒక్కటే తెలుగుదేశం పార్టీ కాకుండా బిజెపికి కేటాయించారు. ఇందులో ముందుగా మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభ్యర్థి అని ప్రచారం సాగింది. అయితే చివరి నిమిషంలో ఆయన కాకుండా సత్యకుమార్‌కు బిజెపి అధిష్టానం టిక్కెట్టు ఖరారు చేసింది. దీంతో అలకబూనిన సూర్యనారాయణ పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఎన్నికలకు ముందు నుంచి అక్కడ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పరిటాల శ్రీరామ్ వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయన కూడా ధర్మవరం టిక్కెట్టు ఆశించారు. కూటమి నుంచి బిజెపి అభ్యర్థిగా సత్యకుమార్‌కు టికెట్టు ఇవ్వడంతో ఎన్నికల్లో శ్రీరాం ఆయనకు మద్దతు పలికారు. అదే విధంగా జనసేన తరుపున అక్కడ రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. ఆయన కూడా టిక్కెట్టు ఆశించినప్పటికీ బిజెపికి కేటాయించడంతో ఆయన కూడా సత్యకుమార్‌కు మద్దతునిచ్చారు. ముగ్గురి మద్దతుతో అక్కడ బిజెపి గెలిచింది. వైసిపి అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఓటమి చెందారు. రాష్ట్రంలోనూ కూటమే అధికారంలో రావడంతోపాటు సత్యకుమార్‌కు వైద్యఆరోగ్య శాఖమంత్రిగా అవకాశం దక్కింది. ఇప్పుడు ఈ నియోజకవర్గంలో మూడు పార్టీల మధ్య ఆధిపత్యపు పోరు నడుస్తోంది. ఎవరి మాట చెల్లుబాటు కావాలన్న దానిపై ప్రతి విషయంలో పోటీ నెలకొంటోంది. అనేక ఏళ్లుగా తాము పార్టీకి పనిచేసి, ఇప్పుడు తమ పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో పాలనా వ్యవహారాల్లో తమ మాట చెల్లుబాటు కావాలని బిజెపి నాయకులు ఆశిస్తున్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో కొంత మంది వైసిపిని వీడి బిజెపిలోకి చేరినవారూ ఉన్నారు. వీరందరూ తమ మాట చెల్లుబాటుకై ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక బిజెపి అంతగా బలంలేని చోట తమ మద్దతుతోనే గెలిచిందని తెలుగుదేశం నాయకులు భావిస్తున్నారు. అందుకోసం తమకు అధిక ప్రాధాన్యత ఉండాలని పోటీ పడుతున్నారు. ఇదే సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా తమ ప్రభావంతోనే కూటమి విజయం సాధించిందని జనసేన నేతలంటున్నారు. ఇలా ముగ్గురి మధ్య పోటీ తీవ్రతరమవుతోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నాడు బత్తలపల్లిలో బిజెపి, టిడిపి నేతల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇది బయటకొచ్చిన అంశమవుతే రాకుండా లోలోనా అంతర్గత వివాదాలు చాలానే నడుస్తున్నాయి. వీటిని ఏ రకంగా అధికమించాలని యోచిస్తున్న దాఖలాలు ముఖ్య నేతల్లో కనిపించడం లేదు. ఎవరి పట్టును నిలుపుకునేందుకు వారు తమతమ ప్రయత్నాలు చాపకింద నీరులా చేస్తున్నారు. అందుకోసం పాలనా వ్యవహారాల్లో సైలెంట్‌గా పావులు కదుపుతున్నారు. దీంతో మూడు పార్టీల మధ్య పోరు రోజురోజుకు చాపకిందనీరులా విస్తరిస్తూపోతోంది.

ఆదివాసీల సంక్షేమానికి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని గిరిజనులు అభివృద్ధి చెందాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 84 వేల మంది గిరిజనులు ఉన్నారన్నారు. వారి సంక్షేమం, అభివద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివాసీలు చికెల్ సెల్ ఎనిమియా వ్యాధిని నిర్మూలించడానికి 40 సంవత్సరాల లోపు ఉన్న వారందరికీ ప్రభుత్వం వైద్య పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. విద్యార్థుల వసతి గహాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. అర్హత ఉన్నవారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. ఈనెల 30న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎస్టీల సమస్యలపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు కృష్ణానాయక్, రమణ నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలతో విజేత విద్యార్థినులు

ఆర్‌డిటి ఆధ్వర్యంలో రూరల్ గర్ల్స్ అథ్లెటిక్స్ పోటీలు

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఆర్‌డిటి ఆధ్వర్యంలో రూరల్ గర్ల్స్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న హైస్కూల్ బాలికలకు అండర్-14, అండర్-16 విభాగాల్లో 60 మీటర్స్ రన్, 100 మీటర్స్ రన్, 200 మీటర్స్ రన్, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు పతకంతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బాలికలు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి అనంతపురం నగరంలోని ఆర్‌డిటి క్రీడీ గ్రామంలో జరిగే పోటీలకు అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్, ప్రిన్సిపల్ సుదర్శన్, ఎటిఎల్ సుధాకర్ పాల్గొన్నారు.

రొద్దం : పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఆర్‌డిటి అథ్లెటిక్ మీట్ అండర్-14 షాట్‌పుట్ విభాగంలో మండలంలోని నారనాగేపల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి బి.మౌనిక(9వ తరగతి) ప్రతిభ కనబరిచినట్లు శుక్రవారం పిఇటి మహేష్ తెలిపారు. మౌనికను హెచ్‌ఎం రామాంజనేయులు, పిఇటి మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఎస్‌ఎంసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు సన్మానం

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసి) ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన వారిని శుక్రవారం పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఘనంగా సన్మానించారు. తిప్పేస్వామి మాట్లాడుతూ నూతన కమిటీల సభ్యులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల, విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ మనోహర్, మీడియా కోఆర్డినేటర్ బేగార్లపల్లి రవికుమార్, భక్తర్‌సాబ్, కల్లుమర్రి సర్పంచి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని వైబిహళ్లి, జిల్లేడుగుంట, కోడిపల్లి పాఠశాలల్లో ఎన్నికైన ఎస్‌ఎంసి సభ్యులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైబిహళ్లి ఉన్నత పాఠశాల ఛైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ ఛైర్మన్ నాగభూషణ, ప్రాథమిక పాఠశాల ఛైర్‌పర్సన్ వసంత, వైస్ ఛైర్‌పర్సన్ హనుమక్క, కోడిపల్లి ప్రాథమిక పాఠశాల ఛైర్మన్ హనుమంతరాయుడు, వైస్ ఛైర్‌పర్సన్ అనిత, జిల్లేడుగుంట ప్రాథమికోన్నత పాఠశాల ఛైర్‌పర్సన్ జయమ్మ, వైస్ ఛైర్‌పర్సన్ ఉషారాణిలను టిడిపి నాయకులు సన్మానించారు.

కామ్రేడ్ బుద్ధదేవ్ మృతికి నివాళి

సోమందేపల్లి : పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య వయోభారం, అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల నాయకులు ఈడిగ లక్ష్మీనారాయణ అధ్యక్షతన బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ బుద్ధదేవ్ విద్యార్థి దశ నుంచే సిపిఎం ఉద్యమాల్లో పాల్గొంటూ అంచెలంచెలుగా పొలిట్‌బ్యూరో స్థాయికి ఎదిగారన్నారు. తుది శ్వాస వరకూ ఆదర్శవంత మైన జీవనం కొనసాగించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేశులు, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, ఈడిగ నాగరాజు, సిఐటియు నాయకులు కొండా వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు నాగభూషణ, చేనేత కార్మిక సంఘం నాయకులు షీలా నారాయణ స్వామి, జింకా నాగరాజు, కుమ్మర కిష్టప్ప, సంజీవప్ప, శ్రీనివాసులు, మాధవ్ పాల్గొన్నారు.

కామ్రేడ్ బుద్ధదేవ్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

సిఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోండి:ఎమ్మెల్యే

మడకశిర రూరల్ : ఈ ఏడాది జులై తర్వాత అనారోగ్య సమస్యలతో ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఉంటే ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్)కి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆదివాసీ గిరిజన దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఆదివాసీ గిరిజన దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అమరాపురం

మండలంలోని ఆరోనహళ్లితండాలో శుక్రవారం జాతీయ ఆదివాసీ గిరిజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తండా మహిళలు ఆదివాసీల సంప్రదాయ దుస్తులు ధరించి నృత్య ప్రదర్శన చేశారు. ఆదివాసీల జాతీయ దినోత్సవ వేడుకలను అధికారుల సమక్షంలో నిర్వహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. వేడుకల్లో టిడిపి మండల కన్వీనర్ గణేష్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జయకుమార్, ఎంపీడీవో భాస్కర్, మండల ప్రత్యేకాధికారి నరసింహమూర్తి, ఆర్ఐ గిరియప్ప, తాలుకా టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి నవీన్ కుమార్, నాయకులు శివరుద్రప్ప, మంజునాథ్, చంద్రశేఖర్‌గౌడ్, మంజు, పరమేశ్వరప్ప, ధనుంజయ, చంద్రశేఖర్‌నాయక్, డీలర్ మోహన్, బాలకృష్ణ, పుష్పబాయి, తదితరులు పాల్గొన్నారు.

కల్లు దుకాణం మూసివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన

రొద్దం : మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామంలో అంగన్వాడీ సెంటర్ పక్కనే నిర్వహిస్తున్న కల్లు దుకాణాన్ని ఐసిడిఎస్ అధికారులు మూతవేయించారు. ప్రజాశక్తిలో శుక్రవారం 'అంగన్వాడీ కేంద్రం పక్కనే కల్లు దుకాణం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత ఉప్పర్లపల్లి వెళ్లి అంగన్వాడీ సెంటర్ పక్కన నిర్వహిస్తున్న కల్లు దుకాణాన్ని పరిశీలించి మూసివేయించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట అంగన్వాడీ కార్యకర్త గంగమ్మ ఉన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో శుక్రవారం రొళ్ల మండలంలోని కాకి(కాంచన కిరీటం) పంచాయతీకి చెందిన 30 కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, గుండుమల తిప్పేస్వామి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై టిడిపిలో చేరామన్నారు. చేరిన వారిలో కె.బ్యాడిగెర, వద్రహట్టి గ్రామాలకు వైసిపి నాయకులు నరసింహప్ప, గంగాధర్, కృష్ణమూర్తి, తిమ్మప్ప, ఈరనాగప్ప, తిమ్మరాజు, వెంకటేష్, హనుమంతు, వెంకటప్ప, దొడ్డ రామప్ప, రంగస్వామి, అప్ప రమేష్, శివశంకరప్ప ఉన్నారు. కార్యక్రమంలో బ్యాడిగెర టిడిపి సీనియర్ నాయకుడు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం వైసిపి వార్డ్ మెంబర్లు టిడిపిలో చేరిక

అమరాపురం పంచాయతీలో వైసిపికి చెందిన 5 కుటుంబాలు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరాయి. వారిలో వార్డ్ మెంబర్లు మంజు, ఈరలింగప్ప, నాయకులు రఫిక్, టైలర్ వీరభద్రప్ప పసుపు కండువా వేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, నాయకులు శివరుద్రప్ప, కెఎన్ఎం.శివకుమార్, మంజునాథ్. తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారితో గుండుమల తిప్పేస్వామి

కొత్తచెరువులో విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ ప్లీనరీలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం

◆ ఉద్యమాలతోనే విద్యార్థుల సమస్యలు పరిష్కారం

◆ మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

◆ కొత్తచెరువులో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

గత పదేళ్లగా దేశంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, ప్రయివేటును ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా కుట్ర చేస్తోందని, ఇలాంటి వాటిని నిరసిస్తూ ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు విద్యార్థులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం అవ్వాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా ప్లీనరీ సమావేశాలు కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డు వద్ద ఉన్న శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. వందలాదిమంది విద్యార్థులతో నాలుగు రోడ్ల కూడలిలో ఎస్ఎఫ్ఐ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్లీనరీలో గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రయివేటీకరణ చేయడానికి అడుగడుగునా కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ విద్యను ప్రతిష్ట పరచడంలో పూర్తిగా విఫలం అవుతున్నారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో విద్యారంపై పూర్తిగా నిర్లక్ష్యం కొనసాగిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు అవుతున్నా విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మఒడి పథకాలు నేటికీ అందలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం వాటిని అందించాలన్నారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యను కాషాయీకరణ చేస్తూ విద్యార్థు లను మతోన్మాద శక్తులుగా మార్చడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రయివేటీకరణ చేస్తూ కార్పొరేట్లకు విద్యారంగాన్ని అప్పజెప్పే కుట్ర జరుగుతోందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు దేశ విదేశాల్లో జరుగుతున్న అనేక అంశాలను పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. శాస్త్రీయ విద్యా విధానం వైపు విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగం పటిష్టం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని మండల కేంద్రాల్లో సంక్షేమ హాస్టళ్లను నిర్మించాల న్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఐటిఐ, డిగ్రీ కళాశాల నిర్మాణాలు చేపట్టా లన్నారు. జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓతూరు పరమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఇంతియాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, బాబ్జాన్, పవన్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, హర్ష కుమార్, శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్, అంజి, ముత్యాలు, నాగమణి, శ్రావణి, శంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి సవిత

ప్రజాశక్తి-గోరంట్ల

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం మండలంలో నెల కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. మంత్రి శుక్రవారం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి స్థానిక బస్టాండ్ వద్ద మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న శ్మశానవాటిక, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కూటమి పార్టీలపై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా మన్నారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తం రూ. 4వేలకు పెంచారన్నారు. దశల వారీగా మిగతా హామీలు నెరవేరుస్తామన్నారు. అంతకుముందు మల్లాపల్లి గ్రామంలో టిడిపి యువ నేత వెంకటరెడ్డి క్రేన్ సాయంతో మంత్రికి యాపిల్ గజమాల వేసి స్వాగతం పలికారు. అలాగే బస్టాండ్ వద్ద సుబ్బారెడ్డి గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె శివాలయం వీధి, ఆంజనేయస్వామి కాలనీలో సీసీ రోడ్లను ప్రారంభించారు. గౌనివారిపల్లిలో చౌక దుకాణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు రాజారెడ్డి, నిమ్మల శ్రీధర్, బాలకృష్ణచౌదరి, పచ్చ అశోక్, అనుమోలు, హరి, రోహిత్, తిరుపాల్, మల్లాపల్లి మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

మండలంలోని కోరేవాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మంత్రి సవిత నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకొని పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి సువర్ణ అశ్వర్థరెడ్డి, ఉప సర్పంచి కమలాకర్‌రెడ్డి, మాజీ సర్పంచి బాలకృష్ణ, నరేంద్ర, రంగయ్య, గుణశేఖర్, చిన్నా, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

గర్భిణులకు భోజనం ఏర్పాటు

పెనుకొండ : మండలంలోని గుట్టూరు, సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి శుక్రవారం ఆరోగ్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు మంత్రి సవిత భోజనం ఏర్పాటు చేశారు. మంత్రి సవిత గర్భిణులకు ఐదేళ్లుగా పౌష్టికాహారం, భోజనం వసతి ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం కూడా గర్భిణులకు పౌష్టికాహారం అందించారు.

కులాల మార్పుపై లోకాయుక్తలో ఫిర్యాదు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని పోలేపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు కులాలు మార్చుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ధి పొందుతున్న వైనంపై ఈ నెల 6వ తేదీ లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో పాటు లోకాయుక్త కర్నూల్, సత్యసాయి జిల్లా కలెక్టర్‌కు రికార్డులతో సహా సమర్పించినట్లు నీరుగంటి నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. వివరాలు.. నడింపల్లి పంచాయతీలోని పోలేపల్లి గ్రామంలో 1996లో ఎలవ సామాజిక వర్గానికి చెందిన కొందరు యానాది కులం(ఎస్టీ) పేరుతో బోగస్ కుల సర్టిఫికెట్లు పొంది ఎస్టీ కార్పొరేషన్ ద్వారా బోర్లు మంజూరు చేయించుకున్నారన్నారు. వారిపై నడింపల్లి వాసులు అప్పట్లో కలెక్టర్, బిసి వెల్ఫేర్ కమిషన్‌కు ఫిర్యాదు చేయగా అధికారుల బృందం విచారణ చేపట్టి వారిని యానాదులు కాదు ఎలవ కులస్తులుగా నిర్ధారించారన్నారు. వారే మరోమారు బిసి-ఎ సర్టిఫికెట్లు పొంది చేయూత పథకం ద్వారా లబ్ధి పొందారన్నారు. ఇంకో సందర్భంలో పిచ్చిగుంట్ల వారమని సర్టిఫికెట్లు పొందారన్నారు. ఇలా వారు మూడు రకాలుగా బోగస్ సర్టిఫికెట్లు పొంది లబ్ధి పొందుతున్న వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

వ్యవసాయాన్ని పరిరక్షించండి : సిఐటియు

కొత్తచెరువులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదిగుబ్బ తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

అమడగూరులో వినతిపత్రం ఇస్తున్న రైతు, కార్మికసంఘం నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఎపి రైతాంగాన్నికి ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వ్యవసాయాన్ని పరిరక్షించాలని కోరుతూ పుట్టపర్తి తహశీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్లు గంగాధర్, పెడపల్లి బాబా మాట్లాడుతూ క్విట్ ఇండియా రోజున బడా కార్పొరేట్ కంపెనీలను బహిష్కరించాలన్న నినాదంతో రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలను, రుణాలను మంజూరు చేసి రైతులను విస్మరించిందని విమర్శించారు. రైతులకు అనుకూలమైన రుణ విమోచన చట్టం, విత్తన చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయమంటే కనీసం పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు, రుణాల రూపంలో ప్రజాధనాన్ని ఉదార స్వభావంతో అందిస్తున్నారని అదే దేశానికి అన్నం పెట్టే రైతుకు మాత్రం నోట్లో మట్టి కొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, పెడబల్లి బాబా, మల్లకాల్వ వెంకటేష్, రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు..

సోమందేపల్లి : కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం రైతు అనుకూల విధానాలు కాకుండా కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యవసాయంలో అమలు చేయడం తగదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.హరి తెలిపారు. ఆల్ ఇండియా కిసాన్ సంఘ్ పిలుపు మేరకు వ్యవసాయ రంగంలో కార్పొరేట్ విధానాలను నిరోధించాలని కోరుతూ శుక్రవారం పెనుకొండ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కె.శ్రీధర్‌కు రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం సమర్పించారు. హరి మాట్లాడుతూ బిజెపి విధానాల ద్వారా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రైతులు వ్యతిరేకించారన్నారు. కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశం శ్రీలంకలా అయ్యేదాకా ఆగకుండా కార్పొరేట్ కంపెనీలు, వారికి మద్దతు ఇచ్చే వారిని బయటకు పంపడమే రైతులు, ప్రజలకు శ్రేయస్కరం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా, మండల కార్యదర్శులు రమేష్, బాబావలి, నాయకులు తిప్పన్న, శివ, సుధాకర్ పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రజా సమస్యల పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం డివిజన్ కార్యదర్శి అంజి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు కలిపిస్తూ పేద మధ్యతరగతి ప్రజల పైన భారాలు మోపుతోందన్నారు. దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గడంతో ఆర్థిక అభివృద్ధి రోజురోజుకు పడిపోతోందన్నారు. వంటగ్యాస్, మొబైల్ ఛార్జీలు పెంచడంతో సామాన్యులకు పెనుభారంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ముత్యాలు, కో కన్వీనర్ శంకర్ రెడ్డి, సిపిఎం నాయకులు సిద్దు, వెంకటేశు, నాగరాజు, శ్రావణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : వ్యవసాయ రంగంలో కార్పొరేట్ కంపెనీలు రావడాన్ని వ్యతిరేకిస్తున్నామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. దేశ వ్యాప్త క్విట్ కార్పొరేట్‌లో భాగంగా శుక్రవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు మాట్లాడుతూ బడా కంపెనీలు వ్యవసాయ రంగంలో అడుగుపెడితే వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినట్లు స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ రైతులు వినియోగించే వ్యవసాయ పరికరాలు, ఎరువుల, క్రిమిసంహారిక మందులపై పన్నులు పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తక్, రఫీ, ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు ఈశ్వర్ రెడ్డి, నారాయణ, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం, సిఐటియు, ఆవాజ్ కమిటీ సభ్యులు రైతుల సమస్యలపై ధర్నా చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు కల్పించాలని అలాగే గిట్టుబాటు ధరకు చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని అన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ ప్రక్రియను వెంటనే ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి వెంకటేశు ,జిల్లా ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, ఆవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్ , రైతు సంఘం నాయకులు పోతలయ్య, రఫీ, నౌషాద్, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : క్విట్ ఇండియా స్ఫూర్తితో రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్ రవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ పక్రియను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : బిజెపి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో రైతులకు నిధులు కేటాయింపులో తీవ్ర అన్యాయం చేసిందని ప్రజా సంఘాలు ఆగ్రం వ్యక్తం చేశాయి. శుక్రవారం ధర్మవరం పట్టణంలో సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి, రైతు సంఘం, చేనేత కార్మిక సంఘాలు నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతులు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో కార్మికులు వేతనాలపై బేరసారాలు లేకుండా, సమ్మెలు చేయకుండా, యూనియన్లు పెట్టుకోకుండా యజమానులు చెప్పిన రీతిలో పనిచేయాల్సిన పరిస్థితి వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ దిల్షాద్, సిఐటియు మండల కన్వీనర్ జెవి. రమణ, కో కన్వీనర్ అయూబ్ ఖాన్, రైతు సంఘం జిల్లా నాయకులు శేషంపల్లి మారుతి, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప, ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, జిల్లా నాయకులు మహాదేవ్‌చ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

ట్యాంకర్ కింద పడి రెండేళ్ల బాలుడు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మోడల్ కాలనీలో శుక్రవారం ఉదయం వాటర్ ట్యాంకర్ కింద పడి రెండేళ్ల బాలుడు మృతిచెందాడు. కాలనీకి చెందిన దినసరి కూలి బాబ్జాన్ కుమారుడు జునైద్(2) శుక్రవారం ఉదయం ఆరు బయట ఆడుకుంటున్న సమయంలో ఆ ప్రాంతంలోకి వచ్చిన తాగునీటి ట్యాంకర్‌తో కూడిన ట్రాక్టర్ బాలుడిని ఢీ కొంది. దీంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి- పుట్టపర్తి రూరల్

జిల్లాలోని పోలీస్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పి విష్ణు తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. 27 మంది పోలీసు సిబ్బంది నుండి పిటీషన్లు స్వీకరించారు. సిబ్బంది సమస్యలను ముఖాముఖిగా తెలుసుకున్న అదనపు ఎస్పీ సర్వీస్ రూల్స్ ప్రకారం సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో పోలీసు కార్యాలయ సూపరింటెండెంట్ మల్లికార్జున, మురళి, నాగరాజు, బాల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

పిల్లల చదువు పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ జయలక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి శుక్రవారం స్థానిక కెజిబివిని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చిన్నప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాంటప్పుడే అనుకున్న గమ్యస్థానానికి చేరుకోగలరని చెప్పారు. అలాగే గుర్తు తెలియని వ్యక్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వంటగది, టాయిలెట్స్, క్లాస్ రూములను పరిశీలించారు. ఎస్‌ఒకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమములో ప్యానెల్ లాయర్లు లింగాల లోకేశ్వర్ రెడ్డి, నరసింహులు, కేజీబీవీ ఎస్‌ఒ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో చెరువులు నింపుతాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తచెరువు

పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణ జలాలతో నింపుతామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర తెలిపారు మండల పరిధిలోనే మరుకుంటపల్లిలో ఎస్సీ కాలనీలో దాతల సహకారంతో 50 లక్షల రూపాయలతో నిర్మించిన కుంటెమ్మ దేవి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన పరికరాలను సబ్సిడీ పైన అందిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో చౌక ధాన్యపు డీలర్ షాపులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాజీ సర్పంచి రమేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, గాజుల చంద్ర, శివప్రసాద్, సుబ్బారెడ్డి, రామకృష్ణ, కిష్ట, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పట్టణంలోని గట్లు దగ్గర పార్థసారథి కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి అన్ని విధాల సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాల్మీకి పాఠశాల అధినేత అనిల్ కుమార్ రెడ్డి, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - గాండ్లపెంట

ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని మండల పరిధిలోని కల్లుబాయి తండా పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కె.రామానాయక్, ఇఒఆర్‌డి సునీత, స్థానిక సర్పంచి శాంతమ్మ కొమరం భీం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ గతంలోని జీవన విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఓబులమ్మ, మదన్ నాయక్, రవికుమార్, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని సీజీ ప్రాజెక్ట్ లో గల ఆంధ్ర ప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ అధ్యక్షతన ఆదివాసుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోత్స్న, వైస్ ప్రిన్సిపల్ బాబు, స్కూల్ కమిటీ ఛైర్మన్ భర్త శ్రీనివాసులు నాయక్, వైస్ ఛైర్మన్ మీనా, టిడిపి మండల కన్వీనర్ టి. రెడ్డి శేఖర్ రెడి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. నల్లమాడ సర్పంచి రమావత్ భారతీబాయి, డీఈవో మీనాక్షి, ఎంఈవోలు వేమనారాయణ, సురేష్ బాబు మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని గురించి వివరించారు. ఈసందర్భంగా సర్పంచి భారతీబాయి, బీలేనాయక్ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్, చాంప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ జిల్లా పర్యటన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 9 :30 గంటలకు ధర్మవరం పట్టణాన్ని చేరుకొని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. 3 :10 గంటలకు అనంతపురం చేరుకొని అక్కడ నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రి 10 :20 గంటలకు రైల్లో హైదరాబాద్‌కు వెళతారు.

ఏకపక్షంగా చట్టాల అమలు వద్దు..

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నూతన చట్టాలను తీసుకు రావాలని, అలా కాకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదని అఖిలభారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఆయన ఆక్షేపించారు. పది సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇష్టా రాజ్యాంగా నూతన చట్టాలు అమలుపరిచి ప్రజల మనోభావాలు దెబ్బతీస్తోందన్నారు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డ్ ఆస్తులపై కన్నేసి నూతనంగా చట్టం తీసుకురావాలని ప్రయత్నించడం శోచనీయమని, దీనిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న 40 కోట్ల ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా చట్టం అమలు పరిస్తే ముస్లింలందరూ ఏకమై బిజెపిని గద్దె దించే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

అంబేద్కర్ విగ్రహం కూల్చివేత దుర్మార్గం నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి - నల్లమాడ

విజయవాడలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం కూల్చివేతకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ మండలం కన్వీనర్ సూర్య నారాయణ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం, పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహం కూల్చివేతకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు గర్భిణులకు పలు ఆరోగ్యసూచనలు చేశారు. 62 మందిలో 34 మంది గర్భిణులను హై రిస్క్ వారుగా గుర్తించి ఉచిత స్కానింగ్‌కు సిఫారసు, ప్రత్యేక చికిత్స తో పాటు ఉచిత మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు, వారి సహాయకులకు రోటరీ క్లబ్ ప్రతినిధులు రంజిత్ కుమార్, పృధ్వీరాజ్ తదితరులు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమం డాక్టర్ కమల్ రోహిత్, ఎఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్య , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

కంటి పట్ల విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆప్తాలమిక్ ఉరుకుందప్ప తెలిపారు. ఈసందర్భంగా ఆయన కోటలోని మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో 95 మంది విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఇందులో నలుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించినట్లు ఉరుకుందప్ప తెలిపారు. అనంతరం కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వహీదా, ఎఎన్ఎం వరలక్ష్మి, ఆశా కార్యకర్త శ్రీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి తహశీల్దార్‌గా మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నూతన తహశీల్దార్‌కు డిటి ముకుంద, సర్వేయర్లు, విఆర్‌ఒలు పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తచెరువు రూరల్ : కొత్తచెరువు తహశీల్దార్‌గా నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను మండలంలోని ఆయా పార్టీల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హిందూపురం : హిందూపురం తహశీల్దార్‌గా వెంకటేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే ఈయనను మడకశిరకు రెగ్యులర్ తహశీల్దార్‌గా, హిందూపురానికి ఇన్‌ఛార్జి తహశీల్దార్ గా నియమించారు. నూతన ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్న బాలయ్య ఇలాఖలో ఇప్పటికి రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించక పోవడంపై విమర్శలు వినపిస్తున్నాయి.

విద్యాకమిటీ ఛైర్‌పర్సన్‌గా రాధ

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని కృష్ణాపురం ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో కమిటీ ఛైర్‌పర్సన్‌గా చెరుకూరి రాధాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - బుక్కపట్నం

రైతులు పంట నమోదు ద్వారా అధిక ప్రయోజనాలు పొందవచ్చునని వ్యవసాయ శాఖ అధికారి సతీష్ బాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తకోట, గూనిపల్లి గ్రామాలలో ఈ పంట నమోదుపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి సతీష్ బాబు మాట్లాడుతూ మండలంలో పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పంచాయతీ కార్యదర్శి శంకర్, విఆర్‌ఒ పోతులయ్య , రైతు సేవా కేంద్రం సిబ్బంది బి సూర్యనారాయణ, అన్నపూర్ణ , రైతులు పెద్దరెడ్డెప్ప, చంద్ర, మల్లికార్జున, వీరనారప్ప, రవి, తిప్పయ్య, గంగులప్ప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలం, అల్లుగుండు గ్రామంలో శుక్రవారం నిర్వహిస్తున్న ఈ పంట నమోదును ఎఒ భారతి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటసాగు చేసిన ప్రతి రైతు ఈ పంట నమోదును చేయించుకోవాలని చెప్పారు. పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ఈసందర్భంగా రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ నవీన్, రైతులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

బుద్ధదేవ్‌భట్టాచార్య చిత్రపటానికి నాయకుల నివాళి

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం అగ్రనేత బుద్ధదేవ్ భట్టాచార్య ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నివాళి అని సిపిఎం పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆపార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు బుద్ధదేవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీనవర్గాలకు అండగా నిలిచి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 2001 నుండి 2011 వరకు కొనసాగరాన్నారు. ఆయన చివర శ్వాస వరకు ఎర్ర జెండానే ఊపిరిగా కొనసాగారని అన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రంలో సిపిఎం ప్రజా సంఘాల నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, ఈశ్వర్ రెడ్డి, కృష్ణ నాయక్, ఆంజనేయులు, రఫీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 వేడుకలకు సిద్ధం కావాలి : ఎఆర్ డిఎస్‌పి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎఆర్ డీఎస్పీ

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పంద్రాగస్టు వేడుకలలో జాతీయ సమైక్యత దేశభక్తి జాతీయభావం ఉట్టిపడేలా సాధన చేయాలని ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎస్పీ కార్యాలయ పెరేడ్ మైదానంలో సాయుధ పోలీసు బలగాలతో పరేడ్ సాధన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో ఈనెల 15 వ తేదీన నిర్వహించే వేడుకలకు సాయుధ పోలీసు బలగాలు పకడ్బందీగా పరేడ్ నిర్వహించాలన్నారు. సాయుధ పోలీసు బలగాల సాధనలో జాతీయ సమైక్యత, దేశభక్తి భావం వెల్లువిరిసేలా ఉండాలన్నారు. ఈసాధనలో ఆర్ఐ వలి, ఆర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రంలో 'పురం' వాసికి బంగారు పతకం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ఉదయ్ దుర్గాప్రసాద్‌కు వ్యవసాయ శాస్త్రంలో బంగారుపతకం వరించింది. వ్యవసాయంపై తనకు ఉన్న మక్కువతో వ్యవసాయ శాస్త్రాన్ని చదివి అందులో ఏకంగా బంగారు బతకాన్ని సాధించడంతో పాటు అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయంలో ఫెలోషిప్ సాధించి అందరి మన్ననలు పొందుతున్నారు.

హిందూపురం పట్టణంలోని సురేష్ , రాజేశ్వరి దంపతుల కుమారుడైన ఉదయ్ మొదటి నుంచి చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ఈ స్థాయికి ఎదిగారు. బెంగళూరులోని మహాత్మా గాంధీ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. వ్యవసాయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ఉదయ్ దుర్గాప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. దీనికి తోడు వివిధ ఈ యూనివర్సిటీలు పరిశోధన శాస్త్రవేత్తగా ఎంపిక చేసేందుకు నిర్వహించిన పోటీ పరీక్షలకు హాజరై ఉత్తమ మార్కులు సాధించడంతో అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయం ఉదయ్‌ను పరిశోధనా శాస్త్రవేత్తగా పనిచేసేందుకు నియమిస్తూ లిఖితపూర్వక ఉత్తర్వులను పంపింది. జార్జియా విశ్వవిద్యాలయం ఉదయ్‌కు అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పించడంతో పాటు ఫీజులో కూడా రాయితీ ఇస్తూ ఫెలోషిప్ కింద ప్రతినెలా రూ.2.40 లక్షల ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. మొక్కల వ్యాధి నిర్ణయ శాస్త్రంలో పరిశోధనా శాస్త్రవేత్తగా పనిచేసేందుకు అమెరికా ప్రభుత్వం నిర్ణయించి ఉదయ్ ని ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఉదయ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వం ఐదు సంవత్సరాలు పాటు పరిశోధన శాస్త్రవేత్తగా పనిచేసేందుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఫీజులతో పాటు అన్ని రకాల వసతులను కల్పించేందుకు ఆ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తాను మొక్కల సంబంధించి సోకే వ్యాధులు, కీటకాల నాశిని తదితర అంశాలపై పరిశోధన చేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో తాను గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతులు కీటకాల వల్ల పంటలను కోల్పోయి నష్టాలను చవిచూస్తున్నారన్నారు. కీటకాల నుండి ఏ విధంగా బయటపడాలి అన్న అంశాలపై పరిశోధన చేయనున్నట్లు తెలిపారు. తన ఎదుగుదలకు తండ్రి సురేష్ తో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంతో సహకారం అందించారని తెలిపారు. హిందూపురానికి చెందిన ఉదయ్ అమెరికాలోని జార్జియా విశ్వవిద్యాలయంలో పరిశోధన శాస్త్రవేత్తగా పనిచేసేందుకు ఎంపిక కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సాధించిన పట్టాను చూపుతున్న ఉదయ్ దుర్గాప్రసాద్

పెట్టుబడి దారులకు, కార్పోరేటర్లకు ఒక న్యాయం? రైతులకు అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.

'ఉపాధి'ని వ్యవసాయానికి అనుసంధానం చేయండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని జిల్లా అధికారులను మండల ప్రజా ప్రతినిధులు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిసైడింగ్ ఆఫీసర్ శివశంకర్, జిల్లా నిఘా అధికారి సుధాకర్ రెడ్డి హాజరై విచారణ చేపట్టడం జరిగింది. 2023-24వ ఆర్థిక సంవత్సరంలో రూ.5.74కోట్లతో 1,072 పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. ఈ పనులలో ఎక్కువగా ఫీడర్ ఛానల్, డగౌట్ పౌండ్లు, పూడికతీత, పండ్ల మొక్కలు, రూరల్ హౌసింగ్, రోడ్డు పనులు, చెక్ డ్యాంలలో పూడికతీత వంటి పనులు చేపట్టారు. ఈ పనులపై గత నెల 28 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు గ్రామాలలో సోషల్ ఆడిట్ సిబ్బంది పనులను పరిశీలించి, గ్రామసభలను నిర్వహించారు. ఈ వేదికలో గ్రామసభలు, సామాజిక తనిఖీలలో వెల్లడైన విషయాలను పంచాయతీల వారీగా చదివి వినిపించారు. మొత్తం రూ 2.68,051 ప్రభుత్వ ధరం దుర్వినియోగం అయిందని దీనిని రికవ చేయాలని ఆదేశించారు. వీటిలో ఇప్పటికే రూ. 2.35,051 రికవరీ కాగా మిగిలిన రూ.11వేలు తండా రికవరీ కావాల్సి ఉందని అధికారులు చెప్పారు. సభకు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఫీల్డ్ అసిస్టెంట్లపైన ఫిర్యాదులు చేస్తూ, వారిపైన చర్యలు తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అయితే అధికారులు రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, అంబుట్స్మెన్ శివారెడ్డి, ఏపీడీలు, ఎస్ఆర్‌పి చంద్రమోహన్, ముండల ఇంజనీర్ రమణయ్య, ఏపీఎం సుదర్శన్ రాజు, వైసిపి మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ వీరనాసప్పు, సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు. ప్రభాకరరెడ్డి, ఇంజనీరింగ్ నాగార్జున, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - నల్లమాడ

పాఠశాల ఆవరణంలో కలెక్టర్, తదితరులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్ శుక్రవారం తనిఖీ చేశారు. మెను ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులతో పాటు వంటగది, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, ఎంఇఒలు వెంకటనారాయణ, సురేష్ బాబుతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తహశీల్దార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

ధర్మవరం తహశీల్దార్ నటరాజును టిడిపి స్థానిక నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పరిసే సుధాకర్, శ్రీశైలం, పురుషోత్తం గౌడ్, 25వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జిభీమినేని ప్రసాద్ నాయుడు తదితరులు తహశీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు.